క్లుప్తంగా

మెరిట్ విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు



మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ సైదులు

రామగిరి(నల్లగొండ) : పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ మెరిట్ సాధించి జిల్లా, మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన నియోజవర్గంలోని విద్యార్థులకు నల్లగొండ పట్టణంలోని ప్రాఫిట్ షూ కంపెనీ ఆధ్వర్యంలో మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ ఎస్ఐ సైదులు పాల్గొని విద్యార్థులకు కాలేజీ బ్యాగ్, షూ, మెమొంటోలు అందజేశారు. అనంతరం కంపెనీ నిర్వాహకులు మాట్లాడారు. టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహంగా బహుమతులు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ నరేంద్ర, ఉపాధ్యాయులు చందునాయక్, తహేర పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ జోన్ చైర్మన్‌గా బుడిగె శ్రీనివాసులు



బుడిగె శ్రీనివాసులు

శాలిగౌరారం : మండల కేంద్రానికి చెందిన శాలిగౌరారం లయన్స్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ బుడిగె శ్రీనివాసులు ఆ క్లబ్ జోన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదన్‌మోహన్ మంగళవారం ఆయనకు నియామక పత్రాలు అందజేశారు.

విద్యార్థులకు పెన్నులు, జామెట్రీ బాక్స్‌ల అందజేత



విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

చిట్యాల : పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ పాఠశాల 2006–07బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆ పాఠశాల విద్యార్థులకు పెన్నులు, జామెట్రీ బాక్స్‌లు, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం అంబటి సత్తయ్య మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాదం భిక్షపతి, సుధాకర్‌రెడ్డి, శారద, సరిత, సతీష్, చైతన్య, వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు చిన్నపాక నాగరాజు, పాల రాకేష్, వంగాల మహేష్, జిట్ట శేఖర్, దమ్మాల నరేందర్, మహేష్, దేవేందర్, శంకర్ పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాసులు

చండూరు : ప్రాణం ఉన్నంత వరకు పేద ప్రజలకు సేవ చేస్తానని గాంధీజీ ఫౌండేషన్, గాంధీజీ పాఠశాలల చైర్మన్ కోడి శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గాంధీజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 19వ నెల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతినెలా 30మంది నిరుపేదలకు రూ.వెయ్యి విలువ చేసే సరుకులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ డైరెక్టర్ సరికొండ వెంకన్న, కోడి శృతి, ప్రిన్సిపాల్ భార్గవ్, పులిపాటి రాధిక, జెల్ల వివేక్, బోడ యాదయ్య, యాదగిరి, విజయ్, గోపి పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనం కూల్చివేత

చండూరు : మండల కేంద్రంలో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న వాణిజ్య భవనాన్ని స్థానిక మున్సిపల్ అధికారులు మంగళవారం కూల్చివేయించారు. ఆ భవనం బీఆర్‌ఎస్‌కు చెందిన మాజీ ఎంపీపీ, మాజీ మున్సిపల్ చైర్మన్ కావడం విశేషం. భవనం కూల్చివేతతో భవన యజమాని తన వద్ద అన్ని రకాలు డాక్యుమెంట్లు ఉన్నాయని, సమాచారం లేకుండా కూల్చారని మున్సిపల్ కార్యాలయానికి పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో వెళ్లి ఆందోళన చేపట్టారు. దీంతో మధ్యాహ్నం వరకు పోలీస్ పహారాతో పట్టణంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. భవనం కూల్చివేతపై మున్సిపల్ కమిషనర్ మల్లేషంను వివరణ కోరగా.. భవన నిర్మాణానికి అనుమతులు కావాలని 2024లో దరఖాస్తు చేసుకోగా ఆ భూమిపై వచ్చిన ఫిర్యాదుల మేరకు అనుమతి ఇవ్వడాన్ని తిరస్కరించి నోటీస్ అందజేశారు. అనంతరం ఈ విషయం హైకోర్టుకు వెళ్లడంతో అనుమతులు ఇవ్వకుండా, నిబంధన మేరకు వెళ్లాలని సూచించిదని, సెలవు రోజుల్లో నిర్మాణం చేపడుతుండడంతో ఆపాలని సూచించామని, అయినా నిర్మాణం చేపడుతుండడంతో కూల్చివేయించినట్లు ఆయన తెలిపారు.

నెరవేరనున్న సొంతింటి కల

- పైలెట్ ప్రాజెక్టు గ్రామం ఇప్పలగూడెంలో మొదటి విడతలో 34మంది ఎంపిక
- 18 ఇళ్ల నిర్మాణాలకు లబ్ధిదారుల ముందుకు
- సాగుతున్న పనులు.. జమ అవుతున్న నగదు
- మండలంలో రెండో విడతలో 425 ఇళ్లు మంజూరు

కేతేపల్లి : అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటోంది. గ్రామాల్లో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ పేదోడి సొంతింటి కలను సాకారం చేయాలని శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా రూ.5లక్షలతో పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తుండడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పైలెట్ ప్రాజెక్టుగా ఇప్పలగూడెం..

ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో మండలంలోని ఇప్పలగూడెం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. దీంతో ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన 34 మంది లబ్ధిదారులను అధికారులు ఎంపిక చేసి ఇళ్లు మంజూరు చేశారు. పక్కా ఇళ్లు లేని నిరుపేద కుటుంబాలు గుడిసెలు తొలగించి వాటి స్థానంలో ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ఇప్పటి వరకు 18మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాగా రెండు ఇండ్లు స్లాబ్ లెవల్, మరో రెండు రూఫ్ లెవల్, 8బేస్‌మెంట్ లెవల్ వరకు పనులు పూర్తయ్యాయి.



ఇప్పలగూడెంలో స్లాబ్ వరకు పూర్తయిన ఇల్లు

మిగిలిన లబ్ధిదారులు త్వరలోనే నిర్మాణం చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఇంటి నిర్మాణాల ఆధారంగా లబ్ధిదారులకు రూ.లక్ష నుంచి రూ.3లక్షల వరకు ఖాతాల్లో నగదు జమ అయినట్లు పేర్కొన్నారు.

రెండో విడతలో 425 ఇళ్లు మంజూరు..

మండలంలో 16గ్రామాలు ఉండగా 14 గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చేతుల మీదుగా ఇటీవల ఇందిరమ్మ గృహ నిర్మాణ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. బండపాలెం గ్రామానికి-11, భీమారం-34, బొప్పారం-28, చెర్కుపల్లి-21, గుడివాడ-27, ఇనుపాముల-38, కాసనగోడు-39, కొండకిందిగూడెం-28, కొప్పోలు-35, కొర్లపహాడ్-42, కొత్తపేట-59, తుంగతుర్తి -43, ఉప్పలపహాడ్-10, చీకటిగూడెం-22 ఇళ్లు మంజూరయ్యాయి. ఇక మండల కేంద్రంలో ఇళ్ల కోసం ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో ఈ విడతలో లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. మూడో విడతలో కేతేపల్లికి ఎక్కువ సంఖ్యలో ఇళ్లు మంజూరు చేసి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిసింది. ఇక లబ్ధిదారుల ఎంపిక పూర్తి కావడంతో ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ క్రమంలో ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరుతుండడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సొంతింటి కల నిజం చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

సంతోషంగా ఉంది



మా గ్రామంలో పైలెట్ ప్రాజెక్టు కింద నాకు ఇళ్లు మంజూరైంది. ఇంటి నిర్మాణం స్లాబ్ పూర్తయి ప్లాస్టింగ్ పనులు నడుస్తున్నాయి. మూడు బిల్లులతో ఇప్పటి వరకు తనకు రూ.3లక్షలు అందాయి. సొంతింటి కల నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది.

– బొబ్బిలి భద్రమ్మ, ఇప్పలగూడెం

ఇబ్బందులు తొలగిపోనున్నాయి



ఇప్పటి వరకు ఒక్క గదిలో ఇబ్బందులు పడుతూ రోజులు గడిపాం. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. మొదటి విడతలో తనకు ఇల్లు మంజూరు అయ్యింది. దీంతో నిర్మాణం చేపట్టాను. మొదటి బిల్లు కూడా అకౌంట్‌లో జమఅయ్యాయి. ఇన్ని రోజులు పడిన ఇబ్బందులు ఇప్పుడు తొలగిపోనున్నాయి. చాలా ఆనందంగా ఉంది.

– కోమటిరెడ్డి అక్కమ్మ, ఇప్పలగూడెం

మావోయిస్టులను శాంతి చర్చలకు పిలవాలి

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూర్ : మావోయిస్టులకు శాంతి చర్చలకు పిలవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నక్సలైట్లను ఆపరేషన్ కగార్ పేరుతో ఏరివేస్తున్నారని, ఉగ్రవాదులతో చర్చలు జరిపి మావోయిస్టులతో చర్చలు చేయకుండా బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారని, కనీసం ఎన్‌కౌంటర్ చేసిన మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు ఇవ్వడం లేదన్నారు. మావోయిస్టులు సమాజహితం కోసమే పాటు పడుతున్నారని, వారితో చర్చించి ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మావోయిస్టులు కూడా జనజీవనంలోకి వచ్చి ప్రజాస్వామ్య ఉద్యమాల్లో పాలుపంచుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం, అమిత్‌షా నియంతల్లా వ్యవహరిస్తున్నారని అన్నారు నియోజకవర్గంలో ఫార్మా కంపెనీల నుంచి వెలువడుతున్న కలుషిత వ్యర్థాలతో ప్రాణవాయువు కరువైందని అందుకే సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యచరణ రూపొందించి పెద్దఎత్తున ఆందోళన చేపడతామన్నారు. వచ్చే స్థానిక ఎన్నికలకు సీపీఐ శ్రేణులు సన్నద్ధం కావాలని సూచించారు. జూలై 15న దేవరకొండలో జరిగే సీపీఐ జిల్లా మహాసభలకు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యం

మహిళా సమస్యలపై పోరాడాలి

మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై భారత జాతీయ మహిళా సమాఖ్య ముందుండి పోరాడాలని మహిళా సమాఖ్య నాయకులకు ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు ఉస్తేల సృజన దిశానిర్దేశం చేశారు. మంగళవారం మండల కేంద్రంలో జరిగిన భారత జాతీయ మహిళా సమాఖ్య నియోజకవర్గ స్థాయి మహాసభకు వారు హాజరై మాట్లాడారు. సమాజంలో మహిళల పట్ల ఎన్నో అఘాయిత్యాలు జరుగుతున్నాయని, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అణిచివేత, సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వంకై పోరాడుదామని, మహిళలపై హింసను వ్యతిరేకిద్దామన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ మాదగోని విజయలక్ష్మి, జిల్లా కన్వీనర్ గిరి రమ, నియోజకవర్గ నాయకులు వల్లి సత్తమ్మ, చంద్రకళ, రజిత, లావణ్య, యశోధ, యాదమ్మ పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

నల్లగొండ టూటౌన్ : తాతల కాలం నుంచి వచ్చిన అసైన్డ్ వ్యవసాయ భూమిలో తాము సేద్యం చేసుకుంటున్నామని, ఆ భూమిని అక్రమంగా ఇతరులకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్న నిడమనూరు మండల రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని నిడమనూరు మండలంలోని ముప్పారం గ్రామానికి చెందిన తెల్కపల్లి శంకర్, తెల్కపల్లి అశోక్, తెల్కపల్లి నాగరాజు, తెల్కపల్లి రాజు, తెల్కపల్లి నవీన్, దుగ్యాల రాధమ్మ మంగళవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. తమ భూమిలో హద్దురాళ్లు పాతిరించారని, తాము 1984నుంచి సర్వే నంబర్ 720లో 6ఎకరాల భూమిని సేద్యం చేసుకుంటున్నామని వివరించారు. మండల సర్వేయర్, ఆర్ఐ, తహసీల్దార్ కలిసి భూమిని ఇతరులకు ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నారని వాపోయారు.

ఇంకుడు గుంతలతో భూగర్భజలాలు పెంపు

- జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు

కట్టంగూర్ : ఇంకుడు గుంతల నిర్మాణంతో భూగర్భజలాలు పెరుగుతాయని జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిర్మించనున్న ఇంకుడు గుంతల మార్కింగ్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. మండల పరిధిలో 26 సోక్ పీట్స్ (ఇంకుడు గుంతలు) నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. డ్రెయినేజీ ద్వారా వచ్చే మురుగునీరు ఇంకుడు గుంతలోకి చేరడంతో పారిశుద్ధ్యం మెరుగుపడడంతో పాటు భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఇంకుడు గుంతల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, ఎంపీఓ చింతమల్ల చలపతి, ఏపీఓ కడెం రాంమోహన్, పంచాయతీ కార్యదర్శి అశోక్, జీపీ సిబ్బంది ఉన్నారు.

మొక్కలు సిద్ధంగా ఉంచాలి

కేతేపల్లి : అన్ని గ్రామపంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు నాటేందుకు సిద్ధంగా ఉంచాలని జెడ్పీ సీఈఓ బి.శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వన నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలు పెంచుతున్న తీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానికంగా ఉన్న కేజీబీవీ పాఠశాలలో నిర్మించిన ఇంకుడు గుంతను పరిశీలించి వర్షపు నీటిని నిల్వ చేయడానికి ఇంకుడు గుంతల ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత నిర్మించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ సంపత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఎఫ్ఏ జెబునిసా ఉన్నారు.



కట్టంగూర్ : ఇంకుడు గుంతల మార్కింగ్‌ను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ శ్రీనివాసరావు

అర్జీదారులకు న్యాయపరమైన పరిష్కారం చూపాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీదేవి

మర్రిగూడ : భూ భారతిలో రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న అర్జీదారులకు న్యాయపరమైన పరిష్కారం చూపాలని చండూరు ఆర్డీఓ వి.శ్రీదేవి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులో దరఖాస్తు చేసుకున్న వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమస్యలు వాటి సంబంధిత రైతుకు నోటీసులు జారీ చేసిన ఏడు రోజుల్లోపు తమ వివరణ ఇచ్చేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార జక్కర్తి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ ఉదావత్ శ్రీనునాయక్, ఆర్ఐలు పాండురంగారెడ్డి, జహీరొద్దీన్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్యదర్శులు సమయపాలన పాటించాలి

మర్రిగూడ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు, ఆదాయ వనరులు పెంపొందించేందుకు గ్రామపంచాయతీ కార్యదర్శులు సమయపాలన పాటించాలని డీఎల్‌పీఓ శంకర్‌నాయక్ అన్నారు. మంగళవారం మండలంలోని శివన్నగూడలో ఇంటి నిర్మాణ అనుమతి, ఖుదాబక్షపల్లిలో నర్సరీ పెంపకం, రాజాపేటతండా సెగ్రిగేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గ్రామంలో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోని గ్రామపంచాయతీ సమస్యల పరిష్కారం కోసం కార్యదర్శులు చొరవ చూపాలన్నారు. నర్సరీల్లో జెర్మినేషన్ పూర్తిస్థాయిలో చేపట్టడంతోనే మొక్కలను సంరక్షించుకోవచ్చని సూచించారు. సంబంధిత సిబ్బంది వేతనాలను కూడా సకాలంలో చెల్లించాలని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులను ఆదేశించారు. అధికారులు, సిబ్బంది తమ విధులకు సక్రమంగా హాజరు కాకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.చినమునయ్య, ఎంపీఓ బి.రవికుమార్, ఆయా గ్రామాల కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది ఉన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న శంకర్‌నాయక్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలి



మర్రిగూడ : సభ్యత్వం అందజేస్తున్న ప్రభావతి

మర్రిగూడ : ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని, మందులు, డాక్టర్ల కొరత తీర్చాలని, పీహెచ్‌సీ స్థాయిలో ఉన్న సమస్యలను వెలికి తీయడానికి ఈ నెల 5న ఐద్వా ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహించే ప్రభుత్వ ఆస్పత్రుల సర్వేను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు రాజాపేటతండాలో ఐద్వా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సరైన వసతులు కల్పించాలన్నారు. సమయపాలన పాటించి మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా మండల కార్యదర్శి దామెర లక్ష్మి, నాయకురాలు కొడదల కల్పన, యాదమ్మ, సోనా, లలిత, వెంకమ్మ, లక్ష్మి, మల్లమ్మ ఉన్నారు.

రోగులకు మందులు అందుబాటులో ఉంచాలి

నార్కట్‌పల్లి : ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు అన్ని రకాల టీకాలు, మందులు అందుబాటులో ఉంచాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు జిట్ట సరోజ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన సర్వేలో ఆమె పాల్గొని వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. ఆస్పత్రిలో బీపీ, షుగర్ వంటి మందులు లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారని, సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఆమె వెంట ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు రుద్రారపు పార్వతమ్మ, రేణుక, వరలక్ష్మి, డాక్టర్ విజయ్‌కుమార్, ఏఎస్‌ఎం సీత, పాల పద్మ, గుండె యాదగిరి తదితరులు ఉన్నారు.

నిందితుడిని శిక్షించాలి

నల్లగొండ టౌన్ : గుర్రంపోడు మండలం జూనూతల గ్రామానికి చెందిన ఓ మహిళకు గడ్డి మందు ఇంజక్షన్ ఇచ్చి అత్యాచారం చేసి హత్య చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మంగళవారం డిమాండ్ చేశారు. నిందితుడు మహేష్‌ను ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. మృతురాలి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని అన్నారు.

ఘనంగా డాక్టర్స్ డే

నల్లగొండ : డాక్టర్స్‌డే సందర్భంగా పట్టణంలోని ఎన్జీ కాలేజి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్లు పుల్లారావు, సుబ్బారావు, అరుణ, రమేష్‌ను మంగళవారం సన్మానించారు. కార్యక్రమంలో సరళ, సరోజ, లక్ష్మీబాయ్, సబిత, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బండారు ప్రసాద్, లింగయ్య, చింతపల్లి వెంకన్న, యాస వెంకట్‌రెడ్డి, పల్లెర్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ఆవరణలో మంగళవారం స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్స్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఏరియా ఆసుపత్రి, ప్రైవేట్ ఆసుపత్రి వైద్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం మొక్కలను నాటి రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ చౌగోని రజితా శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రోగ్రాం చైర్మన్ బ్రహ్మదేవర రమేష్, క్లబ్ డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ యానాల మోహన్‌రెడ్డి, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కందాల పాపిరెడ్డి, ఐఎంఐ అధ్యక్షుడు డాక్టర్ రాపోలు రఘునందన్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శోభారాణి, సెంటినైయల్ క్లబ్ అధ్యక్షుడు కందాల ప్రేమ్‌నాథ్‌రెడ్డి, క్లబ్ ప్రతినిధులు ఎర్ర శంభులింగారెడ్డి, బిచేనేపల్లి ప్రకాష్‌రావు, ఎన్.సూర్యచంద్రరావు, కందాల నారాయణరెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండ : డాక్టర్లను సన్మానిసున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో..

చిట్యాల : పట్టణంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జనగాం రవీందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డాక్టర్స్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం డాక్టర్స్ వెంకటేశ్వర్లు, సత్య నరేష్, మూడ సుదర్శన్, నర్సింహ, రవికుమార్‌ను ఆ క్లబ్ సభ్యులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి రేగులగడ్డ నర్సింహాగౌడ్, జిల్లా క్యాబినేట్ సభ్యుడు వాస రాంమోహన్, జీఏటీ సభ్యుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, పందిరి రమేష్, రంగా వెంకటేశ్వర్లు, అవినేని రమణయ్య, బుస్సా శ్రీనివాస్, కోనేటి ఎల్లయ్య పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యులకు సన్మానం

నార్కట్‌పల్లి : డాక్టర్స్‌డే సందర్భంగా మండలంలోని ఆర్‌ఎంపీ వైద్యులను మంగళవారం ఆంజనేయస్వామి దేవాలయ ప్రధాన అర్చకుడు ఉత్తరపల్లి నరసింహాచార్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సామల చంద్రమౌళి, పాల్వాయి భాస్కర్‌రావు, వనం యాదగిరి, మార్కు నారాయణ, కొంపెల్లి కృష్ణమూర్తి, పద్మ, యల్లాచారి రాములు, గద్దాస్ వెంకన్న, మిర్యాల నగేష్, యాదగిరిరెడ్డి పాల్గొన్నారు.



నకిరేకల్ : ప్రభుత్వ, ప్రైవేట్ డాక్టర్లకు సన్మానిస్తున్న చైర్‌పర్సన్ రజితా, క్లబ్ ప్రతినిధులు

ఘనంగా డాక్టర్స్ డే వేడుకలు

శాలిగౌరారం : మండలంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శాలిగౌరారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు శ్వేత, వాసవి, ఆర్‌ఎంపీ వైద్యులు దునుక వెంకన్న, మాద వెంకన్నను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు, అధ్యక్షుడు గుజిలాల్ శేఖర్‌బాబు, ప్రతినిధులు డెంకల సత్యనారాయణ, దామెర్ల శ్రీనువాసులు, పరమేష్, రాంమ్మూర్తి, భిక్షం, సైదులు, కర్ణాకర్ పాల్గొన్నారు.

రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలి



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న ఏడీఏ

నాంపల్లి : ఎరువుల దుకాణాలలో రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఏడీఏ మునుగోడు వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. దుకాణాల బయట ఎరువులకు, విత్తనాలకు సంబంధించిన ధరల పట్టికను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని దుకాణదారులను ఆదేశించారు. నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట వ్యవసాయ అధికారి ఏఓ శివ, సిబ్బంది ఉన్నారు.

భగీరథ నీరు పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్..

మర్రిగూడ : మండలంలోని పలు గ్రామాల్లో మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో సాక్షి దినపత్రికలో మంగళవారం నిలిచిన మిషన్ భగీరథ నీరు అనే కథనం ప్రచురితమైంది. అందుకు స్పందించిన గ్రిడ్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అధికారులు, సంబంధిత సిబ్బంది మంగళవారం ఉదయం మరమ్మతులు పూర్తి చేసి మిషన్ భగీరథ నీటిని పునరుద్ధరించి నీటిని సరఫరా చేశారు. దీంతో పలు గ్రామాల మహిళలు హర్షం వ్యక్తం చేసి సాక్షి దినపత్రికకు కృతజ్ఞతలు తెలిపారు.

సమ్మెను జయప్రదం చేయాలి

నార్కట్‌పల్లి : ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న అన్నారు. మంగళవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఆయన కార్యదర్శికి సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్‌లకు అనుకూలంగా వ్యవహరించడంతో కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులు పడుతుందన్నారు. ఆయన వెంట గ్రామపంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు మంద ఎల్లయ్య, మంద ఎల్లమ్మ, లింగాల యశోద, కందుకూరి పద్మ, మంద మారమ్మ, మేడి శ్రీను, పరశు రాములు, వెంకన్న, యాదయ్య, పద్మ ఉన్నారు.

రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

నకిరేకల్ : మహిళా పొదుపు సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీడీ శ్రవణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండలంలోని అన్ని గ్రామ మహిళా సంఘాలకు సంఘాల నిర్వహణపై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ప్రభుత్వ పొదుపు సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తోందన్నారు. ప్రతి నేలా తమ పొదుపు డబ్బులు జమ చేయాలరు. ఈ సందర్భంగా ఏపీడీగా నియామకమై తొలిసారి పట్టణానికి వచ్చిన శ్రవణ్‌కుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎం నరహరి, సీసీలు కొండ మట్టయ్యగౌడ్, గంగాధర పద్మ, యశోద, స్వరూప, అన్ని గ్రామాల సంఘ బంధాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.



ఏపీడీ శ్రవణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

చిరుధాన్యాల పంటల సాగుతో అధిక లాభాలు

మర్రిగూడ : రైతులు వరితో పాటు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల పంటలను సాగు చేస్తే అధిక లాభాలు సాధించవచ్చని మునుగోడు సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.వేణుగోపాల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన వీడియోన్ కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు రైతులు చిరుధాన్యాలు, పంటల సస్యరక్షణ చర్యలు వంటి వాటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సహాయ వ్యవసాయ సంచాలకుడు డి.వేణుగోపాల్ మాట్లాడారు. రైతులు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ సాగు చేస్తే అధిక దిగుబడి సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో ఏఓ ఎం.సాహస్ ఏఈఓలు పి.విజయ్‌కుమార్, జి.సుజాత, రైతులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు, అధికారులు

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

నల్లగొండ టౌన్ : పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం, పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి లాటరీ ద్వారా ఎంపిక చేసిన ప్రైవేటు విద్యాసంస్థలకు బెస్ట్ అవైలబుల్ స్కీం ద్వారా విద్యార్థులకు పంపుతున్న పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. కలెక్టర్ స్పందించి ప్రైవేటు విద్యాసంస్థలతో మాట్లాడి విద్య కొనసాగే విధంగా చూడాలన్నారు. ఫీజు నియంత్రణ లేకుండా తమ ఇష్టానుసారంగా డొనేషన్ల పేరుతో, ట్యూషన్ ఫీజు పేరుతో బుక్స్, యూనిఫాం అమ్ముతున్న ప్రైవేటు విద్యాసంస్థలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో పార్టీ పట్టణ కమిటీ సభ్యులు తుమ్మల పద్మ, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, రవీందర్ పాల్గొన్నారు.

ఆషాడ గోరింటాకు సందడి

నకిరేకల్ : ఆషాడమాసం సందర్భంగా పట్టణంలోని హైమా గార్డెన్‌లో మంగళవారం మహిళలు గోరింటాకు వేడుకలను జరుపుకుని సందడి చేశారు. కాలనీ మహిళలంతా కలిసి గోరింటాకును తెచ్చి దంచి అందరూ పెట్టుకుని పాటలు పాడుతూ అలరించారు. మహిళలంతా ఉమ్మడి దంచిన గోరాంటకును పెట్టుకున్నారు. ఈ వేడుకల్లో ఉడిపి ప్రేమ, కవిత, మంగమ్మ, రమణమ్మ, స్వాతి, హరిణి, సౌజన్య, లక్ష్మి, వసంత, విజయ, తదితరులు పాల్గొన్నారు.



చేతులకు గోరింటాకుతో మహిళలు